క్లుప్తంగా

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

వజ్రకరూరు: ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. ఎస్ఆర్పీ లోకేష్‌తో పాటు డీఆర్పీలతో కూడిన సామాజిక తనిఖీ బృందం బుధవారం వజ్రకరూరుకు చేరుకుని రికార్డులు స్వాధీనం చేసుకుంది. ఉపాధి హామీ పనులకు రూ.7.92 కోట్లు వ్యయం చేసినట్లు ఏపీఓ లక్ష్మీబాయి వెల్లడించారు. ఉపాధి హామీ పనులతో పాటు హౌసింగ్, పంచాయతీరాజ్, ఫారెస్ట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణాలు తదితర వాటిని కూడా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్పీ లోకేష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి పనులు చేసిన కూలీల వద్దకు వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు క్షేత్రస్థాయిలో తనిఖీలు పక్కాగా చేస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్, ఉంతకల్లు గ్రామాలకు చెందిన శంకరప్ప, హనుమంత, పాండు, బసవరాజులతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.24,300 నగదు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దాడితో సిబ్బంది రాజకుళ్లాయప్ప, జగదీష్, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలించడమే ధ్యేయం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మారుతమ్మ, అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: రక్తహీనతను నిర్మూలించడంలో భాగంగా సంవత్సరం వయస్సు నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సున్న వారికి ఈనెల 9 నుంచి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ మారుతమ్మ, డాక్టర్ విజేంద్ర తెలిపారు. ఇందులకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నులి పురుగులను నిర్మూలించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల కడుపులో ఉన్న నులిపురుగులు చనిపోతాయని చెప్పారు. తద్వారా పిల్లల్లో రక్త శాతం పెరిగి పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజినేయులు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉరవకొండ: ఈనెల 9న జరిగే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది నుంచి 18 ఏళ్లలోపు వయస్సు పిల్లలకు అందించే ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీపీ నరసింహులు చేతుల మీదుగా పీహెచ్‌సీలు, పాఠశాలల సిబ్బందికి అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటేష్ నాయ్, అనికేత్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ, రమణ, సూపర్‌వైజర్ తిరుపాల్‌బాయి, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుద్ధంగా జీవించాలి



ప్రసంగిస్తున్న రెవరెండ్ ఐజయ్య

కంబదూరు: ప్రతి ఒక్కరూ పాపాన్ని వదిలి పరిశుద్ధంగా జీవించాలని సీఅండ్ఐజీ మిషన్ చర్చ్‌ల వైస్ చైర్మన్ రెవరెండ్ ఐజయ్య సూచించారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన కార్యక్రమానికి ఐజయ్య ముఖ్య ప్రసంగికులుగా పాల్గొని బైబిల్ సందేశాన్ని బోధించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా నాయకులు జోసఫ్‌కిషోర్, రవికుమార్ పాస్టర్లు ప్రసాద్, ఎజ్రా, శ్యామ్‌కుమార్, సర్పంచ్ సంధ్య హరినాథ్, సంఘం పెద్దలు దినాకర్, జాన్‌శాస్త్రీ, ప్రభుదాసు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మగ్గం మెరిసేలా..

- చేనేత పరిశ్రమకు జగనన్న సర్కారు అండ
- 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో చేనేతకు జవసత్వాలు
- 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పింఛన్లు

ఉరవకొండ: చేనేత పరిశ్రమ అభివృద్ధికి, నేతన్నల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమకు జీవం పోసి కార్మికులను ఆదుకునేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం విజయవంతంగా అమలు చేస్తోంది. బ్యాంకుల ద్వారా 'ముద్ర' రుణాలు మంజూరు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలతో చేనేత రంగం సంక్షేమ రంగులు అద్దుకుంది. ఉరవకొండ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత కుటుంబాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఉమ్మడి జిల్లాలో ధర్మవరం తరువాత చేనేతకు ప్రసిద్ధిగాంచిన ఉరవకొండలో ఆరు వేల మగ్గాలు ఉన్నాయి. 2,800 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా 50 ఏళ్లు నిండిన కార్మికులకు 'చేనేత పింఛన్లు' అందిస్తున్నారు. నియోజకవర్గంలో 718 మందికి పింఛన్ పొందుతున్నారు. ప్రతి నెలా రూ.3వేల చొప్పున పింఛన్‌ను తంచన్‌గా ఒకటో తేదీనే అందుకుంటున్నారు. అంతేకాదు నవరత్నాలులో భాగంగా పలు పథకాల కింద కూడా అర్హులైన వారు లబ్ధి పొందుతున్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే జగనన్న పాలనలో చేనేతల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నారని కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఉరవకొండలో పట్టు చీర నేస్తున్న కార్మికుడు

'నేతన్న నేస్తం'తో భరోసా

చేనేత కార్మికుల కష్టాలను పాదయాత్ర సమయంలో కళ్లారా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కాక వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం ఉన్న చేనేత కార్మికునికి నెలకు రూ.2వేలు చొప్పున ఏడాదికి రూ.24వేలు అందిస్తూ వస్తున్నారు. ఐదు విడతల్లో ఒక్కో కుటుంబానికి రూ.1.20 లక్షల మేర ఆర్థిక లబ్ధి చేకురింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు విడతల్లో 5,274 మంది నేత కార్మికుల బ్యాంకు ఖాతాలకు రూ.1.26 కోట్లు జమ చేశారు.

ఉరవకొండ నియోజకవర్గంలో 'నేతన్న నేస్తం' లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం రూ.లక్షల్లో
2019-20	1,224	రూ.293.76
2020-21	963	రూ.231.12
2021-22	949	రూ.227.76
2022-23	1,015	రూ.243.52
2022-24	1,123	రూ.269.52
	5,274	రూ.1265.76

ఆదుకున్న 'నేతన్న నేస్తం'



సొంత మగ్గంపై పట్టు చీరలు నేస్తున్నా. ప్రభుత్వం నాకు జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేసింది. 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేల ఆర్థికసాయం అందుతోంది. మా కుటుంబానికి నేతన్న నేస్తం ఎంతగానో ఆదుకుంటోంది.
– రత్నమ్మ, ఎస్ఎల్ఎస్ కాలనీ, ఉరవకొండ

జగనన్న మేలు మరువలేం



గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోకపోవడంతో నేసిన చీరలకు కూలి కూడా గిట్టేది కాదు. జగనన్న ప్రభుత్వంలో మాకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయి. ముఖ్యంగా 'నేతన్న నేస్తం' సొమ్మును ఉపయోగించుకుని నేను మగ్గంపై ఎన్నో రకాల డిజైన్లతో చీరలు నేస్తున్నాను. ఈ చీరలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. – తులసి, 11వ వార్డు, ఉరవకొండ

కార్మికులకు భరోసా



మేం పట్టు చీరలు నేస్తున్నాం. ఐదు విడతలుగా 'నేతన్న నేస్తం' కింద ఏడాదికి రూ.24 వేల ప్రకారం ఆర్థిక ప్రయోజనం పొందాం. దీంతో మగ్గాలను అభివృద్ధి చేసుకున్నాం. బ్యాంకు నుంచి 'ముద్ర' రుణాలు కూడా అందాయి. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా జగనన్న ప్రభుత్వం చేనేతలకు మేలు చేసింది. – సందా లక్ష్మి, రంగావీధి, ఉరవకొండ

రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

కూడేరు: పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని డీఎల్‌డీఓ ఓబుళమ్మ ఆదేశించారు. బుధవారం ఆమె కూడేరులోని ఒకటి, రెండు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. రెండు సచివాలయాల పరిధిలోని మొత్తం పట్టాదారులు ఎంత మంది.. ఇప్పటికి ఎన్ని రిజిస్ట్రేషన్ అయ్యాయి అని జాయింట్ సబ్ రిజిస్ట్రార్(పంచాయతీ కార్యదర్శి) ప్రభావతితో ఆరా తీశారు. మొత్తం 248 మంది పట్టాదారులుండగా ఇప్పటికి 48 రిజిస్ట్రేషన్ చేసినట్లు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ వివరించారు. రిజిస్ట్రేషన్లపై అలసత్వం వహించకుండా తొందరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని డీఎల్‌డీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, వీఆర్వోలు రమేష్, ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న రిజిస్ట్రేషన్లు..

వజ్రకరూరు: జగనన్న కాలనీల్లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. బుధవారం ఎంపీడీఓ విజయలలిత మాట్లాడుతూ లబ్ధిదారులకు స్థలం రిజిస్ట్రేషన్ చేయించి హక్కు పత్రాలు అందచేయనున్నట్లు వెల్లడించారు. వైస్ ఎంపీపీ సుంకమ్మ తనకు జగనన్న కాలనీలో కేటాయించిన ఇంటి స్థలాన్ని పీసీ ప్యాపిలి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి చాముండి, వీఆర్వో ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శకం ఇక ముగిసిపోయింది. ఎన్ని పార్టీల మద్దతు కూడగట్టుకున్నా ప్రజలు విశ్వసించరని ఏపీఐఐసీ చైర్మన్, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం డి హీరేహాళ్ మండలం నాగలాపురంలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్త లతో కలసి ఊరిదేవర ఉత్సవాల్లో పాల్గొని, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మెట్టు విలేకరులతో మాట్లాడారు. అత్యంత ప్రజాదరణ కలిగిన సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోవడం సాధ్యంకాక రాష్ట్ర, జాతీయ పార్టీలతో చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడే స్థితికి దిగజారి పోయాడన్నారు. ఒంటరిగా పోటీచేసి గెలిచే సత్తా టీడీపీ ఏనాడో కోల్పోయిందన్నారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో బాబు పార్టీకి ఘోర ఓటమి తప్పదన్నారు. కుట్రలు, వెన్నుపోట్లకు కేరాఫ్ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సీఎం కుర్చీ కోసం ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చరిత్రహీనుడిగా మారారని ఆరోపించారు. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల సీఎం అంటూ చెప్పుకునే బాబును ప్రజలు విశ్వసించడం లేదన్నారు. 2019 కంటే ఘోరమైన ఫలితాలను వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు తప్పక చూస్తారని జోస్యం చెప్పారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు.



పార్టీ నాయకులతో కలిసి నాగలాపురంలో పర్యటిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

విశ్వసనీయతకు మారుపేరు జగన్

విశ్వసనీయతకు మారుపేరు సీఎం వైఎస్ జగన్ అని మెట్టు కొనియాడారు. గడిచిన నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో పేదలకు మేలు చేకూరిందన్నారు. అర్హతే ప్రమాణికంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతి గడపలోనూ గరిష్ఠంగా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 610 తప్పుడు హామీలిచ్చి మోసం చేశాడన్నారు. మళ్లీ సూపర్‌సిక్స్ పేరుతో దగా చేసేందుకు సిద్ధమయ్యాడని ధ్వజమెత్తారు. అబద్ధపు హామీలిచ్చే బాబుకు గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు.

సిద్ధం సభకు తరలిరండి..

రాప్తాడు వద్ద ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన 'సిద్ధం' సభకు ప్రజలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని మెట్టు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సర్పంచులు సుదర్శన రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ముదరి పద్మనాభరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

రాయదుర్గంటౌన్: వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికనాజ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఎంవీఐ కార్యాలయంలో మ్యాక్సి, మోటార్, వాహన డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పర్మిట్, ఎఫ్‌సీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్ పత్రాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించుకోవాలన్నారు. భద్రతా నియమాలను పాటిస్తూ గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రైవేటు వాహనాలను కమర్షియల్ వెహికల్‌గా వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్‌టీసీ డిపో మేనేజర్ రామచంద్ర తెలియజేశారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఆర్‌టీసీ డిపో నుంచి టీ సర్కిల్ వరకు ఆర్‌టీసీ సిబ్బంది ర్యాలీలోగా వెళ్లారు. అనంతరం నార్త్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.



కళ్యాణదుర్గం: ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ సిబ్బంది

ఉరవకొండ: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఉరవకొండ ఆర్టీసీ డీఎం బాలాజీ దయాళ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా దేశంలో రోజుకు 1.50 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని, 6లక్షల మంది క్షతగాత్రులవుతున్నారన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై చైతన్యం కల్గించడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్టీఐ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణ

ఉరవకొండ: ఉరవకొండ – బళ్లారి వయా పాల్తూరు, హావళిగి, ఉండబండ గ్రామీల మీదుగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు పునరుద్ధరించారు. ఈ రూటులో ఆర్టీసీ బస్సుల నడవకపోవడం వల్ల పై గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇరు రాష్ట్రాల రవాణా అధికారులకు, మంత్రి వర్గ సభ్యుల దృష్టికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఏపీ – కర్ణాటక మధ్య అంతర్రాష్ట్ర రవాణా అనుమతులను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఉరవకొండ – బళ్లారి మధ్య రెండు బస్సులు రోజూ 8 ట్రిప్పులు తిరిగేలా ఉత్తర్వుల్లో పేర్కొంది. జీఓ విడుదలపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలియజేశారు.



వై.శివరామిరెడ్డి

'టీడీపీ' మాటలు నమ్మి మోసపోవద్దు

గుమ్మఘట్ట: అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి మండలంలోని భూపసముద్రం, ఎర్రంపల్లి, ఎస్.హొసళ్లి, దేవరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు వారి టీం చెప్పే మాటలు నమ్మి మోసపోరాదని సూచించారు. టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని విస్మరించారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఇప్పుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, సర్పంచ్ అనిల్‌కుమార్, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, సీనియర్‌నాయకులు తాళ్లకెర వీరభద్రారెడ్డి, గంధవీడి తిప్పేస్వామి, పూసల రుద్రప్ప, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు రమేష్, ఉమేష్, రాజేష్, రామిరెడ్డి, సత్తిరెడ్డి, మాజీ కన్వీనర్ అశ్వర్థరెడ్డి, హంపన్న, శ్రీపతి, హేమారెడ్డి, స్వామి, కొండారెడ్డి సవారప్ప, డీలర్లు మల్లేశ్, అంజి, తిప్పారెడ్డి, శ్రీధర్, మహమ్మద్‌రఫీ, బేలోడు రామాంజనేయులు, బసిరెడ్డి, పూసల అంజి తదితరులు పాల్గొన్నారు.



భూపసముద్రంలో పథకాలను వివరిస్తున్న మెట్టు విశ్వనాథరెడ్డి

జగనన్నతోనే విద్యాభివృద్ధి సాధ్యం

కళ్యాణదుర్గం రూరల్: జగనన్నతోనే రాష్ట్రంలో విద్యాభివృద్ధి సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తెలిపారు. పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణ మండపంలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పానుగంటి చైతన్య మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా వైద్యం రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. పేద విద్యార్థులు ఉన్నతమైన చదువు చదవాలనే అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన ఇలా ఎన్నో పథకాలను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని తెలియజేశారు. గతంలో కంటే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలవుతోందన్నారు. ఈనెల 18న రాప్తాడులో జరగబోయే సిద్ధం సభకు భారీగా జగనన్న సైనికులు తరలిరావలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు వంశీ, నితిన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, జాయింట్ సెక్రటరీ అన్వేష్, నాయకులు షేక్షా, తాలుకా కురుబ సంఘం అధ్యక్షుడు దోణస్వామి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, నాయకులు టైలర్ శీన పాల్గొన్నారు.



జగనన్నకు జై కొడుతున్న డిగ్రీ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

కుల గణన సర్వే 95 శాతం పూర్తి



కొర్రకోడులో సర్వే చేస్తున్న అధికారులు

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వే మండలంలో 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా బుధవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వేలో పూర్తిగా నిమగ్నమయ్యారన్నారు. మండలంలో మొత్తం 11 సచివాలయాల పరిధిలో 13,706 గృహాలుండగా అందులో 40,150 మంది జనాభా ఉన్నారన్నారు. 12,910 గృహాల్లో 35,832 మందిని సర్వే చేసినట్లు తెలిపారు. ఇంకా 796 గృహాల్లోని 4,318 మందిని సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇందులో కొన్ని కుటుంబాలు శాశ్వతంగా గ్రామాలు వదిలి వెళ్లినవి, మరికొన్ని కుటుంబాలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవి ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ యు.పద్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. పౌర సరఫరా, రెవెన్యూ, పింఛన్లు, గృహనిర్మాణం, ప్రాథమిక విద్య, కుటుంబ సంక్షేమం, ప్రాథమిక ఆరోగ్యం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, ఉపాధి హామి, స్త్రీ,శిశు సంక్షేమం, పశుపోషణ, విద్యుత్, రవాణా, అటవీ, వాటర్‌షెడ్లు, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు కలుగోడులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో ఈనెల 9వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్, బాలాజీ నాయక్ తెలిపారు. ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

దళితులకు భూహక్కు పత్రాలు



భూహక్కు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలో పెనకలపాడులో బుధవారం జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకంలో భాగంగా దళితులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచు నాగమణి, వైస్ సర్పంచు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో 49 మంది దళితులకు భూ హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాల్మాన్ రాజ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరాముడు, ఎంపీటీసీ కమలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, తిమ్మారెడ్డి, ప్రసాద్, గుండ్లపల్లి ఎర్రిస్వామి, ఆనంద్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో ఈనెల 9వ తేదీన మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి బీఎం నాదల్, ఛేంజ్ ఫర్‌సొసైటీ టీమ్ ఫౌండర్ జబీవుల్లా షేక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ క్యాంపు జరుగుతుందన్నారు. గుండె చికిత్సలు, ఆర్థో సంబంధిత సమస్యలు, థైరాయిడ్ చికిత్సలు, ఇతర సాధారణ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

కూడేరు: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల నూతన కమిటీని బుధవారం కూడేరులో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వైవీ మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా మోతీబాయి, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శులుగా మోహన్‌కుమార్, శ్రీలత, ఆర్థిక కార్యదర్శిగా రాజశేఖర్, ఆర్థిక కమిటీ సభ్యులుగా వాణి, సుమాలిని, మహిళా కన్వీనర్‌గా నళిని, సీపీఎస్ కన్వీనర్‌గా రమేష్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

స్టార్టర్ పెట్టె, కేబుల్ చోరీ

కూడేరు: ఉదిరిపికొండకు చెందిన రైతు లక్ష్మీదేవి పొలంలో వ్యవసాయ మోటర్‌కు ఏర్పాటు చేసిన కేబుల్, స్టార్టర్ పెట్టె మంగళవారం రాత్రి చోరీ అయ్యింది. బాధితురాలు బుధవారం కూడేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చోరీ అయిన వస్తువుల విలువ రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపింది.